విద్యుత్తు శాఖలో నిలిచిన బదిలీలు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఎన్పీడీసీఎల్ పరిధిలోని జనగామ సర్కిల్‌లో వివిధ విభాగాల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సోమవారం రాత్రి వరకు అధికారులు జాబితా సిద్ధం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో బదిలీల ప్రక్రియ పారదర్శకంగా, సీఎండీ ఆదేశాలకు అనుగుణంగా జరగడం లేదని కొన్ని యూనియన్ల నాయకులు, పలువురు ఉద్యోగులు ఆరోపించినట్లుగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఈనాడు దృష్టికి ఉద్యోగుల బదిలీల్లో అప్షన్ల ప్రక్రియను అమల్లోకి తెచ్చారు. సీనియార్టీ ప్రాతిపదికన ఉద్యోగులు వారు కోరుకున్న చోట ఇవ్వాలనే నిబంధనలను రూపొందించారు. సోమవారం జాబితాలో కేవలం ఒకరికి, రెండు యూనియన్ల నాయకుల పైరవీలతో సీనియార్టీ ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందనే వాదన వినిపిస్తోంది. రానున్న రెండు మూడు రోజుల్లో బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం.

ప్రయాణం.. కారాదు ప్రమాదం


ఆటోలో వెనుక కూర్చుని ప్రయాణిస్తున్న మహిళలు


ట్రాక్టర్ పైన సెంట్రింగ్ సామగ్రిపై కూలీలు

వాహనాలపై ప్రమాదకరంగా ప్రయాణిస్తూ అనేక మంది మృత్యువాత పడటం, గాయాల పాలవ్వడం నిత్యకృత్యంగా మారుతోంది. రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని పోలీసులు, రవాణా శాఖ అధికారులు చేస్తున్న సూచనలను పట్టించుకోక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పండగ నేపథ్యంలో మంగళవారం పట్టణంలో రద్దీ అధికంగా ఉండగా ఆటోలో మహిళలు వెనుకవైపు కూర్చొని ప్రయాణించడం, ట్రాక్టర్ పైన సెంట్రింగ్ సామగ్రిపై కూలీలు ప్రమాదకరంగా కూర్చొని ప్రయాణిస్తున్న దృశ్యాలను 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. – న్యూస్‌టుడే, జనగామ టౌన్

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, తదితరులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ఖరీఫ్(వానాకాలం) సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్‌లతో కలిసి వానాకాలం ధాన్యం కొనుగోలుపై ఏఈవోలు, డీపీఎంలు, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ.. జిల్లాలో 2.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కానుందని, 55వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కేంద్రాలకు రానుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 180 దొడ్డు రకం, 116 సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వం మొదటిసారిగా సన్నరకానికి రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సన్న, దొడ్డు రకానికి వేర్వేరు రిజిస్టర్లను సరైనవిధంగా నిర్వహించాలని సూచించారు. ఏఈవోలు ప్రతి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించాలన్నారు. సన్నాలకు బోనస్ ఇవ్వనుండటంతో అక్రమాలకు పాల్పడిన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్డీవో వసంత, డీసీఎస్‌వో సరస్వతి, డీఏవో రామారావు నాయక్, డీఎంసీఎస్ హరీశ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జనరల్ ఆసుపత్రిలో వైద్యులతో వాగ్వాదం


జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా జనరల్ ఆసుపత్రికి ఓ రోగిని తీసుకొచ్చిన క్రమంలో రోగి సంబంధీకులు ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యులతో తీవ్ర వాగ్వాదం చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపాల్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓ వ్యక్తికి ముఖంపై గాయాలు కావడంతో కొందరు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం ముఖంపై గాయాలకు చికిత్స ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో వరంగల్ ఎంజీఎంకు వైద్యులు సిఫార్సు చేశారు. ఆయితే గాయపడ్డ వ్యక్తి తరఫున వచ్చిన కొందరు విధుల్లో ఉన్న వైద్యులపై వాగ్వాదం చేస్తూ గొడవకు దిగారు. దీంతో ప్రిన్సిపల్ గోపాల్‌రావు పట్టణ సీఐ దామోదర్‌రెడ్డికి విషయం తెలపగా, పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని రాజాకు తరలించారు. తమపై అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆసుపత్రి వైద్యులు దీపిక, నిహారిక, నర్సింగ్ అధికారులు తులసి, సంధ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శిథిల భవనం..పూల సోయగం



నెల్లుట్లలో ఇంటి పైకప్పుపై పులితీగ అల్లుకుని నిండుగా పూలతో సోయగం పంచుతోంది. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం, ఆరోగ్య ఉపకేంద్రం, మహిళా సంఘ భవనం, పశువుల వైద్యశాల కూడలిలో ఉండడంతో శిథిలమైన భవనం కనిపించకుండా గులాబీరంగు పూలతో చూపరులను ఆకట్టుకుంటోంది.
– న్యూస్‌టుడే, లింగాలఘనపురం

గురుతర బాధ్యత మీదే..!



జిల్లాలవారీగా భర్తీ కానున్న పోస్టులు

జిల్లా	స్కూల్‌అసిస్టెంట్లు	ఎస్‌జీటీ	భాషాపండితులు	పీఈటీ	స్పెషల్ ఎడ్యుకేటర్ (ఎస్‌ఏ)	స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్‌జీటీ)	మొత్తం
హనుమకొండ	73	81	5	7	4	17	187
జనగామ	50	118	21	7	5	20	221
భూపాలపల్లి	41	152	20	7	4	13	237
మహబూబాబాద్	71	264	19	2	5	20	381
ములుగు	33	125	16	1	3	14	192
వరంగల్	66	182	21	6	5	21	301

నేడు డీఎస్సీ విజేతలకు నియామక పత్రాలు


ఉపాధ్యాయుల్లేక.. బోధన సరిగా జరగక.. గాడితప్పిన పాఠశాలలకు ఇకపై మంచి రోజులు రానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుండటంతో బడులకు పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నారు. ఈ దిశగా కొత్త గురువులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలి.. విద్యార్థుల సంఖ్య తగ్గి ఆదరణ కోల్పోతున్న తరుణంలో.. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా కృషి చేయాలి. పేద పిల్లల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించి భవిష్యత్తుకు బాటలు వేయాలి. నేడు సీఎం చేతులమీదుగా నియామక పత్రాలు అందుకోనున్న నేపథ్యంలో బడుల్లో వారి పాత్ర ఎలా ఉండాలో వివరిస్తూ 'ఈనాడు' ప్రత్యేక కథనం..

ఈనాడు, మహబూబాబాద్–న్యూస్‌టుడే, భూపాలపల్లి


హనుమకొండ డీఈవో కార్యాలయంలో డీఎస్సీ విజేతలు

ఆదర్శంగా నిలవాలి ఇలా..

సొంతంగా ఖర్చుచేస్తూ..



ఈ ఉపాధ్యాయుడు రేగూరి సుభాకర్‌రెడ్డి.. భూపాలపల్లి మండలం గొర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సొంతంగా ఖర్చు చేసి విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌తో పాటు ప్రత్యేకంగా ఐడీ కార్డులు తయారు చేయించారు. 14 మంది విద్యార్థులు ఉపకార వేతన పోటీ పరీక్ష రాయగా సొంతంగా ఫీజు చెల్లించారు. విద్యార్థిని అక్షిత ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తే.. రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచి..



భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాచర్ల శ్రీనివాస్ విద్యార్థుల సంఖ్య 20 నుంచి 40కి పెరిగేలా కృషి చేశారు. సొంతంగా ఖర్చు చేసి స్కూల్ బ్యాగులు, షూ, నిఘంటువులను అందించారు.

సౌర వెలుగులు అందించి..



భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఐత తిరుపతి 14 అటవీ గ్రామాల పాఠశాలల విద్యార్థులకు సుమారు వెయ్యి మందికి రెడ్కో సంస్థ ఆధ్వర్యంలో సోలార్ ల్యాంపులు పంపిణీ చేశారు. రాత్రి వేళ చదువుకునేలా విద్యా వెలుగులు అందించారు. అమెరికాలోని మిత్రుడి సాయంతో విద్యా సామగ్రి, 77 మంది పిల్లలకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రాథమిక పాఠశాలలు కొత్తగా రానున్న సార్లతో కళకళలాడనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పదోన్నతులతో ఖాళీ అయిన స్థానాలన్నీ కొత్త గురువులతో భర్తీ కానున్నాయి. 922 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరిన తొలిరోజు నుంచే బడిబాగుకు పాటుపడాలి. విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి.

భాషలో రాణించేలా..

తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలు అంటే విద్యార్థులు భయపడు తున్నారు. విధుల్లో చేరబోతున్న 102 మంది భాషా పండితులు ప్రత్యేక చొరవ చూపాలి. ఆటపాటలు, కథలు, నుడికారాలు, సామెతలు, వంటి వాటితో భాషపై ఆసక్తి పెంచాలి.

క్రీడల్లో వెలుగొందాలి

వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ చేపట్టడం శుభపరిణామం. ఉమ్మడి జిల్లాలో 30 మంది విధుల్లో చేరనున్నారు. ఇకపై మైదానాలు కళకళలాడాలి.. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా సిద్ధం చేయాలి.

'సబ్జెక్టు'పై పట్టు సాధించేలా..

ఉమ్మడి జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇటీవల పదోన్నతుల ద్వారా సబ్జెక్టు ఉపాధ్యాయులు వచ్చినా ఇంకా కొరత నెలకొంది.. ఇకపై ఆ సమస్య ఉండదు. కొలువుదీరనున్న 334 మంది స్కూల్ అసిస్టెంట్లు ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రతి పాఠ్యాంశాన్ని మూలాల్లోకి వెళ్లి బోధించాలి. కృత్యాధార, ప్రయోగాత్మకమైన బోధన చేయాలి.

ప్రత్యేక 'బోధన'కు పెద్దపీట

ఉమ్మడి జిల్లాలో ఎంతో కాలంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు బోధకుల్లేక అవస్థలు పడ్డారు. ఇకపై వారికి మంచి రోజులే.. వారి కోసమే 26 మంది స్కూల్ అసిస్టెంట్లు, 105 మంది ఎస్‌జీటీలు విధుల్లో చేరనున్నారు. 'ప్రత్యేక' అవసరాలను గుర్తించి వారిలో మానసిక వికాసాభివృద్ధి జరిగేలా దోహదపడాలి.

మూల మలుపులు.. మృత్యుగండాలు!

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలంలోని పలు ప్రధాన రహదారుల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. వీటి గుండా వేలాది మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మూలమలుపుల విస్తరణ సరిగా లేకపోవడంతో మండల పరిధిలో ఎక్కడో ఒక చోట గాయాలు, మరణాలు సంభవిస్తూనే ఉంటున్నాయి. మలుపులను విస్తరించి, సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వరుస ఘటనలు.. ప్రజల బెంబేలు..

నెలల వ్యవధిలోనే వరుసగా పలు ఘటనలు చోటుచేసుకున్నాయి. వావిలాల శివారులో గత నెల 3న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఇది మరువక ముందే 28న పశువులను తరలిస్తున్న ఓ వాహనం బోల్తా పడి 13 ఆవులు, లేగదూడలు మృత్యువాత పడ్డాయి. 25 వరకు తీవ్రంగా గాయపడ్డాయి. రోడ్డు ప్రమాదాలకు వావిలాల శివారు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ నెల 1న గూడూరు శివారులోని మలుపు వద్ద ఓ లారీ వేగంగా దూసుకొచ్చి బోల్తా పడి ముగ్గురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వేగం కారణంతోనే అదుపు తప్పి పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం..

- అశోక్, ఆర్‌అండ్‌బీ డీఈ

ప్రమాదకర మూలమలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. రహదారి విస్తరణలో భాగంగా మలుపులు సరిచేసేలా చర్యలు తీసుకుంటాం. పాలకుర్తి పరిధిలో పలు ప్రమాదకర మూల మలుపులున్నాయి. వాహనదారులు కూడా రాత్రిళ్లు జాగ్రత్తగా ప్రయాణించాలని కోరుతున్నా.


ముత్తారంలో ప్రమాదకరంగా..

పరిష్కారం చూపరూ..

పాలకుర్తి మండలం వల్మిడి, ముత్తారం మధ్య సుమారు 6 అత్యంత ప్రమాదకర రహదారి మూల మలుపులు ఉన్నాయి. రెండు చోట్ల వంతెన ఉండగ.. ఆయా ప్రదేశాల్లో పెను ప్రమాదం పొంచి ఉంది. విస్నూరు నుంచి మైలారం మీదుగా ధర్మాపురం వెళ్లే మార్గంలో 8 ప్రమాదకర మూల మలుపులు ఉన్నాయి. ఆయా మార్గంలో తరుచూ ప్రమాదాలు సంభవిస్తాయి. బమ్మెర నుంచి జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లికి వెళ్లే మార్గంలో పలుచోట్ల ఇదే పరిస్థితి. ఈ దారుల గుండా వెళ్లేవారికి ప్రమాదాలు జరగకుండా అధికారులు ముమ్మర చర్యలు తీసుకోవాల్సి ఉంది.

బతుకమ్మకుంటలో పూల పండగ



జనగామ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బతుకమ్మకుంటలో మంగళవారం జరిగిన వేడుకకు పార్టీ మహిళా విభాగం సమన్వయకర్త నీలం పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజంలో పేద, ధనిక తారతమ్యం లేకుండా ఐక్యతకు బతుకమ్మ నిలుస్తోందని ఆమె చెప్పారు. ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ, ఆనందోత్సాహాలకు వేదికగా నిలిచే దసరా పండగ రాష్ట్రాన్ని విజయపథంలో నడిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, పిన్నింటి కావ్యశ్రీ రెడ్డి, మండలాధ్యక్షురాలు కాముని జయ, పట్టణాధ్యక్షురాలు జక్కుల అనిత, తదితరులు పాల్గొన్నారు.



కుడా.. బడా!

పరిధి పెంపునకు ప్రతిపాదనలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) సరసన త్వరలో వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) నిలవనుంది. 'కుడా' పరిధి విస్తరించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి.. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం పంపించారు. త్వరలోనే అనుమతి వచ్చే అవకాశం ఉంది. 'కుడా' పరిధి పెంపుతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పెరిగే అవకాశాలున్నాయి. అనంతరం గ్రేటర్ వరంగల్ పరిధి పెంపుపై నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం పెద్దది. నగర విస్తరణతో పాటు సమగ్రాభివృద్ధి కోసం ప్రాజెక్టు సమగ్ర నివేదిక(డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్(డీపీఆర్) సిద్ధమవుతోంది.


హనుమకొండలో 'కుడా' కార్యాలయం

ప్రస్తుతం ఇలా..

- 'కుడా' విస్తీర్ణం 1805 చదరపు కిలో మీటర్లు
- వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని 19 మండలాలు, 181 గ్రామాలు
- **మండలాలు:** భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హనుమకొండ, హసన్‌పర్తి, ఐనవోలు, కమలాపూర్, కాజీపేట, ఖిలావరంగల్, వరంగల్, వేలేరు, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, సంగెం, వర్ధన్నపేట, చిల్పూరుగుట్ట, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్

ఎమ్మెల్యేల సుముఖత

'కుడా' పరిధి పెంపునకు స్థానిక ఎమ్మెల్యేలు సైతం అంగీకరించినట్లు తెలిసింది. అధికారికంగా లేఖలు కూడా ఇచ్చారని సమాచారం. గతనెల హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

కొత్త ప్రతిపాదనలు

- కొత్తగా 1050 చదరపు కిలో మీటర్ల విస్తరణ
- అదనంగా మరో 8 మండలాలు, 95-100 గ్రామాల విలీనం
- జనగామ, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల, హుజూరాబాద్ పురపాలక సంస్థలతో పాటు 8 మండలాలు ప్రతిపాదించారు.
- జనగామ, హుజూరాబాద్ మండలాలు 'కుడా'లో కలిపేందుకు ప్రజాప్రతినిధుల నుంచి కొంత వ్యతిరేకత ఉందని తెలిసింది.
- 'కుడా' పరిధి పెంపునకు సంబంధించిన అన్ని రకాలైన మ్యాప్‌లు, ఇతర వివరాలు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపించారు. మున్సిపల్ శాఖ సీఎం వద్ద ఉండటంతో ఒకేసారి రెండు ఆమోదాలు లభిస్తాయని అధికారులంటున్నారు.


నేడు కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: నేడు(బుధవారం) కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ రిజ్వాన్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించే సంబరాల్లో కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. శాఖలవారీగా చక్కగా పేర్చిన బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలో గురువారం జరిగే సద్దుల బతుకమ్మ ఉత్సవాలలో ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేయనున్నట్లు స్పోర్ట్స్, కల్చర్ క్లబ్ అధ్యక్షుడు అంజయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు.



వీడియో కాల్ చేస్తారు.. కొల్లగొడతారు!



- కమిషనరేట్‌లో ఈ ఏడాది 41 కేసులు

ఈనాడు, వరంగల్, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం

కొత్త దారులు వెతుకుతూ..

సైబర్ మోసగాళ్లు ఎప్పటికప్పుడు నేరాలకు పాల్పడేందుకు కొత్త దారులు వెతుకుతూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. గతంలో చరవాణులకు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా లింక్‌లు పంపించి, మల్టీలెవల్ మార్కెటింగ్, ఓటీపీ సంఖ్యలు తెలుసుకొని లేదా డెబిట్, క్రెడిట్ కార్డులు, బహుమతులు వచ్చాయని, తక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తామని మోసాలకు పాల్పడేవారు. తాజాగా సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, పోలీసు, ఏసీబీ అధికారుల పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు.

పిల్లల పేరు చెప్పి..

పిల్లలు ఇతర దేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో చదువుతుంటే వారిపై డ్రగ్స్ లాంటి కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం తమ అదుపులో ఉన్నాడని, తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాము చెప్పిన ఖాతాలకు డబ్బులు పంపిస్తే వెంటనే విడుదల చేస్తామని. . లేదంటే అరెస్టు తప్పదనేసరికి తల్లిదండ్రులు ఆందోళన చెంది డబ్బులు నష్టపోతున్నారు.

సమాచారం ఇలా సేకరిస్తారు

సైబర్ నేరగాళ్లు మన ఫోన్ నెంబర్, ఇతర వ్యక్తిగత వివరాలు సేకరించేందుకు అనేక రకాలుగా సాంకేతికతను వినియోగిస్తున్నారు. పలు బ్యాంక్‌లు, వివిధ సంస్థలు, మాల్స్ నుంచి ఖాతాదారులకు సంబంధించిన డేటా సేకరిస్తున్నారు. లేదా మహిళలతో కొన్ని నెంబర్లకు ఫోన్ చేయించి వివరాలు తెలుసుకొని కొద్దిరోజుల తర్వాత సైబర్ నేరాలు చేసేందుకు వాడుతున్నారు.

నేరుగా కేసులుండవు

కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలు నేరుగా కేసులు నమోదు చేయవు.. న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితులుగా ఎవరైనా ఉన్నా వాట్సాప్, వీడియో కాల్స్ చేయరు. చట్ట ప్రకారం నిందితులకు నోటీసు పంపిస్తారు. ఇలాంటి పేర్లతో కాల్స్ వస్తే ఆందోళన చెందకుండా వెంటనే సైబర్ విభాగానికి ఫిర్యాదు చేయాలి.

మన దగ్గర అనేక ఘటనలు

- గత నెలలో జనగామ జిల్లాలో పని చేస్తున్న పలువురు ప్రభుత్వ అధికారులకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆదాయానికి మించి అస్తులున్నాయని, మీరు లంచం తీసుకున్నారని, బెదిరింపులకు పాల్పడుతూ మోసాలు చేసేందుకు ప్రయత్నించారు. కొంతమంది వీరికి చిక్కి డబ్బులు పోగొట్టుకున్నారు. మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు పెట్టారు.
- మూడు రోజుల క్రితం హనుమకొండకు చెందిన పారిశ్రామిక వేత్తకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి సీబీఐ అధికారులమంటూ రూ.28.50 లక్షలు కాజేశారు.
- హనుమకొండ టీచర్స్ కాలనీకి చెందిన ఓ మహిళకు ఇటీవల ఒక వీడియోకాల్ వచ్చింది. ఆమె ఫోన్ ఎత్తగానే 'హలో మేం సీబీఐ ముంబయి నుంచి మాట్లాడుతున్నామని, మీ అబ్బాయిని మరో నలుగురితో కలిసి అరెస్టు చేశాం' అని చెప్పారు. ఆమె ఒక్కసారిగా కంగుతిన్నా తర్వాత తేరుకున్నారు. అబ్బాయి హైదరాబాద్‌లో హాస్టల్ ఉంటే ముంబయిలో ఎలా అరెస్టు చేస్తారని రాంగ్ కాల్ అని పెట్టేశారు.
- పది రోజుల క్రితం హనుమకొండ జిల్లాకు చెందిన ప్రభుత్వ అధికారికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి మీపై ఈడీ కేసు నమోదైందని, దిల్లీలోని కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని వాట్సాప్‌కు కొన్ని పత్రాలను పంపించారు. డబ్బులు ఇస్తే మాఫీ చేస్తానని చెప్పాడు. అనుమానం వచ్చిన ఉద్యోగి తన స్నేహితుడితో విషయం తెలిపాడు. పోలీసులతో నిర్ధారించుకొని నకిలీ అని తేలడంతో డబ్బులు పంపించకుండా జాగ్రత్తపడ్డాడు.

అప్రమత్తత అవసరం

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతుంటారు. వ్యక్తిగత సమాచారం, ఆధార్, పాన్ కార్డు నంబర్లు చెప్పవద్దు.. ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

ఈ ఏడాది కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్‌లో వీడియో కాల్ కేసులు :	41
మొత్తం సైబర్ కేసులు	748
ఉమ్మడి వరంగల్‌లో నమోదైన మొత్తం సైబర్ కేసులు	1215
మోసపోతే ఫిర్యాదు చేయాల్సిన నెంబర్	1930



సైబర్ నేరాలపై వరంగల్ కమిషనరేట్ సైబర్ విభాగం వారు ఇటీవల నిర్వహించిన అవగాహన సదస్సు

రవాణా మాటున చేతివాటం



ఆర్టీసీ లహరి ఏసీ బస్సు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆర్టీసీ సంస్థ నష్టాలను అధిగమించేందుకు కార్గో పార్శిల్, కొరియర్ రవాణా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమైన ప్రయాణ ప్రాంగణాల్లో బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల ద్వారా బుకింగ్ అయిన సరకులను రవాణా చేస్తుంది. దీన్ని ఆసరా చేసుకొని కొందరు డ్రైవర్లు ఈ రవాణా మాటున చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఇటీవల ఓ తనిఖీలో తేలింది. గత నెల 26న బెంగళూరు నుంచి హనుమకొండకు వస్తున్న లహరి ఏసీ బస్సును హైదరాబాద్ వద్ద టీటీఐ అధికారులు తనిఖీ చేసారు. అందులో 16 మంది ప్రయాణికులు ఉన్నారు. వారితో పాటు ఏ ప్రయాణికుడికి సంబంధంలేని ప్లాస్టిక్ వస్తువులతో నింపిన ఆరు గన్నీ సంచుల మూటలు, వస్తువులతో కూడిన రెండు అట్టపెట్టెలు లభించాయి. అవి ఎక్కడివని డ్రైవర్లను ప్రశ్నించగా కార్గో ద్వారా బుకింగ్ అయి వస్తున్నాయని చెప్పారు. వాటికి సంబంధించిన రశీదు లేకపోవడంతో మూటలను స్వాధీనం చేసుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేసి డిపోకు అప్పగించారు. వారికి విధులు అప్పగించకుండా విచారణ జరిపించాల్సిన డిపో అధికారులు మరుసటి రోజు నుంచే విధులు కేటాయించడం పలు విమర్శలు దారితీసింది. విలాసవంతమైన ఏసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి సరకులు రవాణా చేస్తే ఆ బస్సులు మరమ్మతులకు గురవుతాయని నిపుణులు చెపుతున్నారు. కార్గో బుకింగ్ చేయని ఎలాంటి వస్తువులు, పార్శిల్ కవర్లు రవాణా చేయకూడదనే నిబంధన ఉంది. ఈ విషయమై సంబంధిత ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావును వివరణ కోరగా లహరి బస్సు డ్రైవర్లకు ఛార్జిషీట్ జారీ చేశామని, విచారణ జరుగుతోందని చెప్పారు. ఇది ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లతో పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, కార్యదర్శి సారంగపాణి, నాగపురి రమేశ్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్లు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు. ఈ సందర్భంగా నాగపురి రమేశ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి నిరంతర సాధన అవసరమన్నారు. పారా ఒలింపియన్ దీప్తిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో జరిగే టోర్నీల్లో రాణించాలని సూచించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా కోటలో పోలీసు ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డానన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి పోటీల వివరాలను వెల్లడించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) టైమింగ్ ఆధారంగా జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఉంటుందని వివరించారు. హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్, ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, పోటీల నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

మరో రికార్డే లక్ష్యంగా సాధన

పారిస్ పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి చాలారోజుల తర్వాత వరంగల్ వచ్చింది. అథ్లెట్లు దీప్తిని ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా దీప్తి 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 2025లో జరిగే వరల్డ్ అథ్లెటిక్స్, 2026లో ఏషియన్ గేమ్స్‌కు సన్నద్ధం అవుతున్నట్లు వివరించారు. ఈసారి నూతన వరల్డ్ రికార్డు నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. శారీరక, మానసిక లోపాలను వరంగా మార్చుకోవాలని నాగపురి రమేశ్ తెలిపారు. దీప్తి లోపమే ఆమెకు వరంగా మారిందన్నారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.కైఫ్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్‌కుమార్ జావెలిన్ త్రోలో రజతం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్ జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేష్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లను నాగపురి రమేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి అభినందించారు.

పసుపు వర్ణం సీతాకోకచిలుక



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలో పసుపు వర్ణం సీతాకోకచిలుక దర్శనమిచ్చింది. సాధారణ సీతాకోకచిలుక కన్నా పెద్దదిగా ఉండటంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. ఇది దశలిపట్టు కుటుంబానికి చెందినది.. శాస్త్రీయ నామం ఆంథెరియా పాఫియా.. సాధారణంగా మాత్ అని పిలుస్తారని కాకతీయ యూనివర్సిటీ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ వత్సవాయి సత్యనారాయణరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, వాజేడు(ములుగు జిల్లా)

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు సన్వి



వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన బాలిక పతకాలతో రాణించింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు యాదాద్రి భువనగిరిలో రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. హనుమకొండ నయీంనగర్‌కు చెందిన అనిశెట్టి సన్వి మూడు విభాగాల్లో పతకాలు సాధించింది. అండర్-14లో 500 మీటర్ల విభాగంలో స్వర్ణం, 1000 మీటర్లలో రజతం, 5000 మీ. విభాగం ఎలిమినేషన్‌లో కాంస్య పతకాలతో అదరగొట్టింది. డిసెంబరు 5 నుంచి 15 వరకు మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. సన్విని ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్యదర్శి కైలాస్‌యాదవ్ అభినందించారు.

డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది



పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు, సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసుల డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గత మూడ్రోజులుగా భద్రాద్రి జోనల్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులకు వరంగల్ కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న డ్యూటీ మీట్ మంగళవారంతో ముగిసింది. 18 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు పతకాలను అందించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన అధికారులను హైదరాబాద్‌లో జరిగే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకుంటే కేసుల దర్యాప్తులో నిందితులను సులువుగా పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలీసు అధికారికి విధి నిర్వహణలో డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అటవీ జంతువులను వేటాడిన ఆరుగురిపై కేసు



నిందితులతో ఎఫ్ఆర్వో శంకర్, సిబ్బంది

ములుగు టౌన్, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో శంకర్ తెలిపారు. ములుగు మండలం జాకారం చెరువు శివారు పంట పొలంలో అడవి పందులకు ఉచ్చులు అమర్చి హతమార్చినట్లు మంగళవారం ఉదయం తమకు సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, జాకారానికి చెందిన ఒర్సు కొమురయ్య తన పంట పొలంలో అమర్చిన ఉచ్చులకు అడవి పంది, మనుపిల్లి చిక్కగా వాటిని కాల్చుతూ కనిపించగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అడవి పంది పడిందని, తీసుకెళ్లి విక్రయించాలని కొమురయ్య ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఒర్సు పరశురాం, ముదంగుల రాజు, ఆటకుంట సోమయ్య, ఒర్సు కొమురయ్య, ఒర్సు రాజు ఆటోలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని ఆటోను సీజ్ చేయడంతోపాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్:	197
స్కిన్‌లెస్:	224



ప్రత్యేక డిస్కౌంట్లు.. ఆకట్టుకుంటున్న వాహనాలు

గిర్మాజీపేట : ఓరుగల్లు నగరంలో వాహనాల మార్కెట్ జోరందుకుంది. దసరా దీపావళి పండగల నేపథ్యంలో భారీ డిస్కౌంట్లతో వివిధ ఆటో మొబైల్ కంపెనీలు వాహన ప్రియులను ఆకర్షిస్తున్నాయి. లక్కీ డ్రాతో బంపర్ ఆఫర్లను ప్రకటించాయి. ఎంపికచేసిన మోడల్స్‌పై రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్ ఇస్తున్నారు. ఫైనాన్స్ సౌకర్యంతో పాటు, హెల్మెట్, ఐదు లీటర్ల పెట్రోల్, మొబైల్, గ్యాడ్జెట్స్‌ను కంపెనీలు ఉచితంగా అందిస్తున్నాయి. హోండా యాక్సస్‌రీస్‌పై ఏడాది వారంటీ ఇస్తున్నారు. ప్రతి వాహనం కొనుగోలుపై స్క్రాచ్ కార్డు, లక్కీడ్రా కూపన్‌ల ద్వారా కచ్చితమైన బహుమతులు పొందొచ్చు. లక్కీడ్రా విజేతలు సుజుకీ గిక్సర్ 250, యాపిల్ ఐఫోన్లు, హోం థియేటర్లు, బంపర్ ప్రైజ్ కింద మారుతీ సుజుకీ కారును గెలుచుకునే అవకాశం ఉంది. ప్రతి బైక్ కొనుగోలుపై ఎల్ఈడీ స్మార్ట్ టీవీ ఉచితంగా పొందొచ్చు. పండగల వేళ వాహన కొనుగోలుదారుల ఇళ్లలో సంబరాలు నిండేలా బహుమతులు అందుకోవచ్చు. ఆధునిక ఫీచర్లతో కార్లు, యువత మనసును దోచేలా బైకులు, మోపెడ్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. రెడీమేడ్ వస్త్రాలు లేటెస్ట్ వెరైటీ డిజైన్లు, సరికొత్త స్టాకుతో ఆకట్టుకుంటున్నాయి.

వైభవంగా దేవి నవరాత్రులు


పట్టణంలోని శ్రీవిల్లాస్ కాలనీలో..


నర్మెట్టలో..


జనగామ: గుండ్లగడ్డలో..


లింగాలఘనపురంలో ..


జనగామ: పెంబర్తిలో శాకంబరీ మాతగా..


బచ్చన్నపేట: తమ్మడపల్లిలో..

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అమ్మవారు వివిధ ప్రాంతాల్లో శ్రీ మహా లక్ష్మీ, శాకంబరి మాతగా, చండికా దేవి, అన్నపూర్ణదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

– న్యూస్‌టుడే, బృందం


పాలకుర్తి సోమేశ్వరాలయంలో..


జఫర్‌గఢ్: కూనూర్‌లో..


స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండలో

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ


అప్పిరెడ్డిపల్లిలో..

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన నాగంపెల్లి లిఖిత ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం పరామర్శించారు. అనంతరం కోలుకొండకు చెందిన భారాస యువజన నాయకుడు కోతి ప్రవీణ్ తండ్రి సోమల్లయ్య ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండగా అతణ్ని పరామర్శించి వివరాలడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట భారాస నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, బస్వ మల్లేశం, కొల్లూరి సోమయ్య, చింత రవి, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు


ఏర్పాట్ల పరిశీలనలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, తదితరులు

జనగామ, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంలో బతుకమ్మ, దసరా వేడుకలను, ఆ తర్వాత దుర్గమ్మ పండగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా తాను తోడ్పాటునందిస్తానని డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ జనగామ ఇన్‌ఛార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బతుకమ్మకుంటలో ఉత్సవ ఏర్పాట్లను స్థానిక కౌన్సిలర్లతో కలిసి పరిశీలించి, ఆలయ కమిటీ ప్రతినిధులతో చర్చించారు. పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే వేడుకలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనిత, జి. రాంచందర్, కర్రె శ్రీనివాస్, బొట్ల శ్రీనివాస్, పార్టీ పట్టణాధ్యక్షుడు సీహెచ్ బుచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్రయవిక్రయాల్లో అవకతవకలపై విచారణ


బచ్చన్నపేట పీఏసీఎస్‌లో విజిలెన్స్ అధికారుల విచారణ

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: బచ్చన్నపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పలు అవకతవకలు జరిగాయని అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం వరంగల్ విజిలెన్స్ అధికారులు పీఏసీఎస్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. భూమి లేకున్నా ఓ వ్యక్తికి 2020-21 యాసంగి కొనుగోళ్లలో డబ్బులు వేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వో గౌతమ్ ఆధ్వర్యంలో కార్యాలయంలో 13మంది రైతులతో కలిసి విచారణ చేశారు. పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, సీఈవో బాలస్వామి, పలు గ్రామాల కర్షకులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో అభివృద్ధికి అవకాశం


శిక్షణ సామగ్రిని అందిస్తున్న పీ.వై.శ్రీనివాస్.

జనగామ, న్యూస్‌టుడే: వ్యాపార రంగంలో ఏర్పడిన పోటీని తట్టుకునేందుకు చేనేతలు తమ వృత్తిలో మెలకువలను, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చేనేత అభివృద్ధి కమిషనరేట్ పీఆర్వో పీవై శ్రీనివాస్ అన్నారు. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులకు 'సమర్థ్' పథకంలో భాగంగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంపికైన వారితో మంగళవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 45 రోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకుని మౌఖిక పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు కొనుగోళ్లు జరపాలి

నర్మెట్ట, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటలను సీసీఐ, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం నర్మెట్ట శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పత్తికి మద్దతు ధర రూ.7525 ఉండగా వ్యాపారులు క్వింటాలుకు రూ.6000 నుంచి రూ.6200కే కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ అన్నదాతలను విస్మరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహులు, రవీందర్, నాగరాజు, కర్ణాకర్, గట్టయ్య, బాలసిద్దులు, శ్రీను పాల్గొన్నారు.

దసరా తర్వాత ఉద్యోగాల భర్తీ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ వైద్య కళాశాల/జిల్లా జనరల్ ఆసుపత్రిలో పొరుగు సేవల పద్ధతిలో భర్తీ చేయనున్న పలు ఉద్యోగాలకు ఇటీవల దరఖాస్తులను స్వీకరించిన విషయం విదితమే. అభ్యర్థుల ప్రొవిజినల్, మెరిట్ జాబితాను ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం మంగళవారం ప్రదర్శించాల్సి ఉండగా, వాయిదా వేసినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపాల్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ ఇంకా పరిశీలన దశలో ఉన్నట్లు, దసరా పండగ సెలవుల నేపథ్యంలో తర్వాత జాబితా ప్రకటన, అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

బస్‌స్టేషన్‌లో చోరీలతో కలవరం


జనగామ బస్‌స్టేషన్‌లో మంగళవారం నెలకొన్న ప్రయాణికుల రద్దీ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో చోరీల భయం నెలకొంది. ఇటీవల కొద్ది నెలలుగా వరుసగా చోరీ ఘటనలు వెలుగుచూస్తున్నాయి. మహిళల నుంచి ఆభరణాలు చోరీ కావడం, పలువురు ప్రయాణికుల నుంచి నగదు ఎత్తుకెళ్లే దొంగల భయం ప్రయాణికులను వెంటాడుతోంది. తాజాగా శనివారం పట్టణానికి చెందిన నివేదిత అనే వృద్ధురాలు 35 తులాల ఆభరణాలను బస్సులోనే అపరిచిత వ్యక్తులు కొట్టేశారు. బస్ స్టేషన్‌లో రోజూ సగటును ఐదు చరవాణులు అపహరణకు గురవుతున్నాయి. బస్‌స్టేషన్‌లో అపరిచిత వ్యక్తులు ఎక్కువగా సంచరిస్తున్నారు. అటు కాలనీల్లో, ఇటు బస్టాండ్‌లో దొంగతనాలతో ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. పట్టణ పరిధిలో పోలీసులు పకడ్బందీగా నిఘా ఉంచడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇకనైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి బస్‌స్టేషన్‌లో గస్తీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ ఆడుతున్న వైద్య సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సంధ్య, వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘనపురం: ప్రాథమిక ఆరోగ్య


లింగాలఘనపురంలో డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

కేంద్రంలో మంగళవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి హాజరయ్యారు. ఆట పాటలతో సందడి చేశారు. వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రఘునాథపల్లి: మండల ప్రాథమిక వైద్య కేంద్రంలో మంగళవారం మహిళా వైద్య సిబ్బంది బతుకమ్మను ఆట పాటలతో సందడి చేశారు. వైద్యాధికారి కమల్‌హాసన్, సీహెచ్‌వో రామ్‌కిషన్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి నూతన దుస్తులు అందజేత

జఫర్‌గఢ్: సద్దుల బతుకమ్మ, దసరా పండగను పురస్కరించుకొని మండలంలోని తమ్మడపల్లి(ఐ) పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు తాజా మాజీ సర్పంచి గాదెపాక అనిత సుధాకర్‌బాబు సొంత ఖర్చులతో నూతన దుస్తులను కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం అందించారు.

వెంకన్న ఆలయంలో భక్తుల పూజలు


చిల్పూర్‌గుట్ట వెంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు


చిల్పూర్: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. అర్చకులు స్వామివారికి బంగారు పద్మాలతో అష్టదళ పాదపద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో మోహన్, అర్చకులు రవీందర్ శర్మ, సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం. రమేష్ అన్నారు. మండలంలోని శివునిపల్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామ మహాసభకు హాజరై ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ కార్యదర్శిగా రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నేతలు యాకయ్య, వెంకటనర్సు, భగత్, సతీష్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడిగా ప్రకాశం



స్టేషన్‌ఘన్‌పూర్: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మండలంలోని చాగల్లు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కొల్లూరు ప్రకాశం ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన పీఆర్టీయూ రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో ప్రకటించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

రఘునాథపల్లి: పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై కర్షక, కార్మిక వర్గాలు కమ్యూనిస్టు ఉద్యమాల్లో చేరి హక్కులను సాధించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మహేందర్ అన్నారు. మండలంలోని గోవర్ధనగిరిలో మంగళవారం గ్రామ సభను నిర్వహించారు. ముఖ్య- అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. కార్మిక వర్గం, రైతాంగానికి చేయూత కరువైందన్నారు. అనంతరం నూతన గ్రామ కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సుధా, రేణుక, మహేశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నగేశ్



రఘునాథపల్లి: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రఘునాథపల్లి మండలం నిడిగొండకు చెందిన బిర్రు నగేశ్ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్ నాగోల్ దివ్యాంగుల సామూహిక భవనంలో జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికలో నగేశ్‌కు పదవి అప్పగించినట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు గోపాల్ తెలిపారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను పురస్కరించుకొని పెంచిన నిత్యావసరాల ధరలు వెంటనే తగ్గించాలని మాజీ ఎమ్మెల్యే సీహెచ్. రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లుట్లలో నకిర్త రాములు అధ్యక్షతన మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ మండల కార్యదర్శి రావుల సదానందం మాట్లాడుతూ ధరలు తగ్గించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా సహాయ కార్యదర్శి ఆదిసాయన్న, ఎల్లయ్య, యాదయ్య, సిద్దయ్య, చంద్రశేఖర్, వీరస్వామి, పరశురాములు, ఎర్రయ్య పాల్గొన్నారు.

యోధుల జీవితం ఆదర్శప్రాయం


టానూనాయక్ కుటుంబ సభ్యులతో వేణుగోపాల్

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: నాడు స్వతంత్రోద్యమంతో పాటు నిజాంలు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన యోధుల చరిత్రను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ రచయిత, జర్నలిస్టు, ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కడవెండిలోని దొడ్డి కొమురయ్య, ధర్మాపురంలోని జాటోతు టానునాయక్ స్థూపాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం టానునాయక్ సోదరుడు దర్గ్యానాయక్‌తో ముచ్చటించి అనాటి రైతాంగ సాయుధ పోరాట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సాయుధ పోరాటంపై పరిశోధన చేసిన ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పస్నూర్ రమేష్, కన్నారపు శివశంకర్, ఎంఈవో కళావతి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మార్చాలని వినతి



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ మండలం పెంబర్తి గ్రామ సమీపంలో హైవే పక్కనే ఏర్పాటు చేసిన ఓ మద్యం దుకాణం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే అక్కడి నుంచి వైన్స్‌ను మార్చాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఎక్సైజ్ అధికారి అనితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ.. ఇష్టారాజ్యంగా సిటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. నాయకులు బూడిద గోపి, భూక్య చందూనాయక్, బొట్ల శ్రావణ్, శ్రీకాంత్, సురేష్, కనకాచారి, తదితరులు పాల్గొన్నారు.

భాజపా విజయంపై సంబరాలు



నర్మెట్ట, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆ పార్టీ మండలాధ్యక్షుడు రంగు మురళి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి ధరావత్ రాజునాయక్ హాజరై బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర సహాధ్యక్షుడిగా రమేశ్



జనగామ అర్బన్, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మిర్యాల రమేశ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి రమేశ్‌కు సముచిత స్థానం కల్పించారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి, జనగామ మండలాధ్యక్షుడు బొగ్గారపు శ్రీనివాస్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


రాములు(పాత చిత్రం)

తరిగొప్పుల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన గొలుసుల రాములు(70) తన వ్యక్తిగత పనుల నిమిత్తం తన ఎక్సెల్ వాహనంపై తరిగొప్పులకు వెళ్లి, ఇంటికి వెళ్తున్నాడు.. జనగామకు చెందిన విక్రమ్ తన ద్విచక్రవాహనంపై తరిగొప్పుల నుంచి జనగామకు వెళ్తుండగా, అక్కరాజుపల్లి స్టేజీ వద్ద అదుపుతప్పి రెండు వాహనాలు ఢీకొనగా, రాములు మృతి చెందాడని తెలిపారు. విక్రమ్‌కు తీవ్ర గాయాలుకావడంతో జనగామ ఏరియాసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్సై శ్వేతను వివరణ కోరగా.. తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చోరీకి పాల్పడిన ఒకరికి 9 నెలల జైలు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఇంట్లో చోరీలకు పాల్పడుతున్న ఒక వ్యక్తికి జనగామ కోర్టులో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుచరిత మంగళవారం తీర్పు వెల్లడించారు. జనగామ పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి కథనం ప్రకారం.. గత ఏడాది అగస్టు 15న జనగామ పట్టణానికి చెందిన మధుమోహన్ ఇంటికి తాళం వేసి దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లాడు. తిరుపతి నుంచి వచ్చిన తర్వాత ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ సంగతి గుర్తించాడు. బీరువాలో ఉన్న సామాను చిందరవందర చేశారు. మధుమోహన్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై గూడ అరుణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి పాల్పడ్డ నల్గొండ జిల్లా చండూరు మండలం నర్మెట్టకు చెందిన నారపాక దశరథను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సదరు కేసు ఇన్నాళ్లు కోర్టులో విచారణ సాగి తుది తీర్పు మంగళవారం వెల్లడించారు. చోరీకి పాల్పడినట్లుగా నిరూపణ కావడంతో దశరథకు 9 నెలల జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసును పీపీ కిరణ్‌కుమార్ వాదించగా, సాక్షులను కోర్టు డ్యూటీ ఆఫీసర్ రవికుమార్ ప్రవేశపెట్టారు.

రాయితీ బియ్యం పట్టివేత

చిల్పూర్, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నపెండ్యాలలో అక్రమంగా తరలిస్తున్న రాయితీ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని నమిలిగొండ గ్రామానికి చెందిన మేకల సారయ్య వివిధ గ్రామాలలో తక్కువ ధరకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేసి ట్రాలీ ఆటోలో తీసుకొని వెళ్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాల వద్ద సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి రూ.13 వేల విలువ చేసే 5 క్వింటాళ్ల బియ్యం, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్రమ మద్యం సీజ్

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: మండలంలోని నమిలిగొండ గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని సోమవారం రాత్రి ఆబ్కారీ శాఖ పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన గట్ల ఈశ్వర్, తాళ్లపెల్లి సాయిలు అనే ఇద్దరు వ్యక్తులు తమ ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లుగా సమాచారం. ఈ విషయమై సీఐ భాస్కర్‌రావును చరవాణి ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

మట్టి తరలింపు అడ్డగింత

పాలకుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తరలింపు యథేచ్ఛగా కొనసాగుతోంది. మండలంలోని మల్లంపల్లి శివారులో మంగళవారం జేసీబీ సాయంతో మట్టిని తోడుతుండగా, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఆర్ఐ రాకేష్ అడ్డుకొని రెండు జేసీబీలతోపాటు మట్టి తోడుతున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని, తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేశారు. ఈ విషయమై ఆర్ఐ మాట్లాడుతూ.. మొత్తం 25 ట్రాక్టర్లు పట్టుకున్నామని, మిగతావి తప్పించుకున్నాయని వివరించారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తరలింపునకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: వృత్తి విద్యాకోర్సుల్లో మరింత మెళకువలు సాధించేందుకు విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వై.శ్రీహరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని చౌడారం పాఠశాలలో వృత్తి విద్యా కోర్సుల బోధనలో భాగంగా విద్యార్థులు కంప్యూటర్ విద్య, టూరిజం, హస్పిటాలిటీపై మరింత పట్టు సాధించాలని సూచించారు. దసరా సెలవుల్లో 10 రోజులు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.